సాక్షి అనకాపల్లి

బుధవారం, 14, మే, 2025



మామిడి షాపుల్లో తనిఖీలు

మామిడి పండ్ల షాపుల్లో ఆహార నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించి, శాంపిళ్లను సేకరించారు. 8లో

ఉష్ణోగ్రతలు

మంగళవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	36.0/24.0
చోడవరం	:	38.0/27.0

వర్ష సూచన

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షంపడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గాలి గంటకు వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

నేడు మాక్ ఎక్సర్‌సైజ్



ఇన్‌చార్జి కలెక్టర్ జాహ్నవి

తుమ్మపాల: శత్రువుల దాడులు చేసే సమయంలో తమను తాము రక్షించుకునే విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 14న మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఎం.జాహ్నవి తెలిపారు. మన దేశంపై శత్రువులు దాడిచేసే పరిస్థితి సంభవించినప్పుడు ఏర్పడిన అత్యవసర పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు అనకాపల్లి బైపాస్ రోడ్డులోని జయభేరి మారుతీ షోరూం ఎదురుగా గల గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ వద్ద ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించే మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని, జాగ్రత్తలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర సంసిద్ధతపై పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేవతికి కాంస్య పతకం



రేవతిని అభినందిస్తున్న జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటరామ

అనకాపల్లి: బిహార్ రాష్ట్రంలో ఈనెల 8 నుంచి 14 వరకూ నిర్వహించిన 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అనకాపల్లి పట్టణానికి చెందిన క్రీడాకారిణి కె.రేవతి కాంస్య పతకాన్ని సాధించినట్టు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.వెంకటరామ(రాము) తెలిపారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో కె.రేవతిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రేవతి.. జిల్లాకు మరిన్ని పతకాలు సాధించాలన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో ఆదుకుంటాం



లోవపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ అనిత

రాంబిల్లి(అచ్యుతాపురం): ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా నిర్వాసితులకు తగిన న్యాయం చేస్తామని, పునరావాసంతో పాటు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ అనిత తెలిపారు. మండలంలోని లోవ పాలెంలో మంగళవారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. ఎన్యుమరేషన్‌తోపాటు, నిర్వాసితులకు ఏ ప్రాతిపదికన పరిహారం అందిస్తారన్న దానిపై అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టి..కొల్లగొట్టి

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

పోలవరం ఎడమ కాల్వ, అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు



తందాలదిబ్బ సమీపంలో పంటపొలాల్లో పొక్లెయిన్‌తో తవ్వకాలు



యలమంచిలి మండలం బయ్యవరం సమీపంలో అసైన్డ్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రాంతం

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- అడ్డుకట్ట వేయాలని ప్రజల డిమాండ్



ఏటికొప్పాకలో అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతంలో అధికారులతో అక్రమార్కుల వాగ్వాదం

యలమంచిలి రూరల్: మండలంలో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది.అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా నిర్వహిస్తూ రూ.కోట్లు గడిస్తోంది.అధికార టీడీపీ,జనసేన నేతల అండదండలు మట్టి మాఫియాకు ఉండడంతో అధికారులు సైతం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్టు,చెరువులు,అసైన్డ్ భూములు,పంట పొలాల్లో మట్టిని యంత్రాలతో యథేచ్ఛగా తవ్వుతూ టిప్పర్లు,ట్రాక్టర్లతో ప్రైవేటు వెంచర్లు,కట్టడాలు, ఇటుక బట్టీలకు తరలించి రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ అక్రమ మట్టి తవ్వకాలను రెవెన్యూ,గనుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఇంతవరకు కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.మండలంలో నిత్యం కొంతమంది టీడీపీ,జనసేన గ్రామ,మండల స్థాయి నాయకుల కనుసన్నల్లో ప్రతి రోజూ పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లతో మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. మంగళవారం యలమంచిలి మండలం ఏటికొప్పాకలో సచివాలయం ఎదురుగా ఉన్న రహదారి మీదుగా వీఆర్వో చూస్తుండగానే పది ట్రాక్టర్లతో మట్టిని ఓ ఇంటి నిర్మాణ పనులకు తరలించడం ,ఆ వివరాలను సేకరించేందుకు వెళ్లిన కొందరు మీడియా ప్రతినిధులపై మట్టి మాఫియా దురుసుగా ప్రవర్తించడం, మీ ఇష్టం వచ్చిన పనిచేసుకోండని ప్రవర్తించిన తీరు మండలంలో చర్చనీయాంశమైంది.

కల్పతరువు.. పోలవరం కాల్వ గట్లు

యలమంచిలి మండలంలో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్ల నుంచి గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.కొందరు అక్రమార్కులు అధికార కూటమి నేతల అండదండలతో రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా యంత్రాలతో తవ్వకాలు జరిపి,లారీలు,ట్రాక్టర్లతో అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారు.లారీ సైజును బట్టీ గ్రావెల్ లేదా మట్టి లోడుకు రూ.6 వేల నుంచి రూ.22,500 వేలు,ట్రాక్టరుకు రూ.1500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తున్నారు. నిరంతరాయంగా ఈ దందా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ముఖ్యంగా ఈ అక్రమ తవ్వకాలపై నిఘా ఉంచి, అడ్డుకోవాల్సిన రెవెన్యూ,గనుల శాఖ అధికారులు, కింది స్థాయి సిబ్బంది పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఎవరైనా మీడియా ప్రతినిధులు తెలియజేసినప్పుడు లేదా పత్రికల్లో వార్తలు వచ్చిన సందర్భాల్లో ఒకటి రెండ్రోజులు హడావుడి చేయడం తప్ప పకడ్బందీగా మట్టి మాఫియా ఆగడా లు కట్టించడంలో అధికారులు విఫలమవుతున్నారనే చెప్పాలి.మట్టి అక్రమ తవ్వకాలు ఎక్కువగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారే వరకు,ఇతర సెలవు దినాల్లో జరుగుతున్నాయి.ఇక కొన్ని చోట్ల పట్టపగలే దర్జాగా అధికారపార్టీ ప్రజా ప్రతినిధుల అండదండలతో ఈ దందా కొనసాగుతోంది. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వెంచర్లు,బట్టీలు,నిర్మాణాలకు తరలింపు

యలమంచిలి పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు,ఇటుక బట్టీలు, నిర్మాణాలకు మట్టిని భారీగా తరలిస్తున్నారు.వెంచర్లు వేసేటప్పుడు మట్టి ఎక్కువగా అవసరమతుంది.వీటికి అవసరమయ్యే మట్టి లేదా గ్రావెల్‌ను జనసేన,టీడీపీ నేతలు గంపగుత్తగా మాట్లాడుకుని మట్టి తోలుకుని రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ గ్రావెల్,మట్టి తవ్వకాల సమాచారం అందించినా గనుల శాఖ అధికారులు సిబ్బంది కొరత పేరుతో తప్పించుకునేందుకు యత్నిస్తున్నారు.ఎక్కడైనా మట్టి అక్రమంగా తవ్వకాలు జరుపితే ఎంత మొత్తంలో మట్టి తరలించారో నిర్ధారించాల్సిన గనుల శాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.ఇక రెవెన్యూ అధికారులు,సిబ్బంది సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.తమ కళ్ల ముందే అక్రమ వ్యవహారం జరుగుతున్నా కళ్లకు గంతలు కట్టుకోవడం మరీ దారుణం.

మీడియాపై దౌర్జన్యం

మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్న సంగతి తెలిసి కొందరు మీడియా ప్రతినిధులు వాటిని కవర్ చేసేందుకు వెళుతున్నపుడు అక్రమార్కులు వారిపై దురుసుగా ప్రవర్తించడం,కొందరు దుర్భాషలాడుతూ,దౌర్జన్యాలకు దిగడానికి కూడా వెనుకాడడం లేదు. ఫొటోలు,వీడియోలు తీస్తున్న మీడియా ప్రనినిధులను అడ్డుకోవడం,వారిపట్ల దురుసుగా మాట్లాడడం పరిపాటిగా మారింది.ఇటీవల యలమంచిలి సమీపంలో మామిడివాడ,కొత్తూరు ప్రాంతాల్లో ఒక జనసేన నాయకుడు అక్రమంగా చేస్తున్న మట్టి తవ్వకాల వద్దకు వెళ్లిన ఒక మీడియా ప్రతినిధిపై దౌర్జన్యానికి దిగాడు.మంగళవారం యలమంచిలి మండలం ఏటికొప్పాకలో జరుగుతున్న మట్టి అక్రమ రవాణా వద్దకు వెళ్లిన మీడియా ప్రతినిధులతో అక్రమార్కులు మీ ఇష్టం వచ్చిన పని చేసుకోండి..ఏమీ చేయలేరని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం వెనుక అధికార యంత్రాంగం అండదండలు స్పష్టంగా కనిపిస్తున్నాయనే చెప్పాలి.మీడియా ప్రతినిధులు సమాచారం ఇచ్చినా గ్రామస్థాయిలో వీఆర్వో అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ తవ్వకాలు జరుపుతున్న పొక్లెయిన్,మట్టి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను అక్కడి నుంచి తరలించుకుపోయిన తర్వాత అక్కడకు వెళ్తుండడం వెనుక ఆంతర్యం బహిరంగ రహస్యమే.

చర్యలు తీసుకుంటాం



అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. మట్టి,గ్రావెల్ తవ్వకాలపై నిఘా ఉంచుతున్నాం. గ్రామ స్థాయిలో వీఆర్వో,ఆపైన ఆర్‌ఐలు పర్యవేక్షించేలా ఆదేశాలిస్తున్నాం.ఎక్కడైనా అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేస్తే మాకు సమాచారం అందించాలి.తక్షణమే మా సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపించి ఆయా వాహనాలను స్వాధీనపర్చుకుని. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–కె.వరహాలు, తహసీల్దార్, యలమంచిలి

స్టాఫ్ నర్సుల పోస్టుల్లో కోత

- 246 పోస్టుల భర్తీ నిలువుదల
- గందరగోళంలో అభ్యర్థులు

మహారాణిపేట(విశాఖ): స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఆరు నెలలుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియలో పోస్టుల సంఖ్యలో తరచూ మార్పులు చోటు చేసుకోవడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. తొలుత ఉత్తరాంధ్ర జిల్లాల్లో 106 పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరించగా, ఆ తర్వాత మరో 264 పోస్టులు చేరాయి. మొత్తం 370 పోస్టుల భర్తీకి అధికారులు సిద్ధమయ్యారు. తాజాగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాలతో 246 పోస్టుల భర్తీని నిలిపివేశారు. ప్రస్తుతం కేవలం 124 పోస్టుల భర్తీకి మాత్రమే ఎంపిక జాబితాను విడుదల చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. వైద్య విధాన పరిషత్, పట్టణప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే ఆస్పత్రుల్లో పోస్టులను మాత్రమే భర్తీ చేయనున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండే కమ్యూనిటి హెల్త్ సెంటర్లు, ఇతర ఆస్పత్రుల్లో 90 పోస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 34 పోస్టుల మాత్రమే భర్తీ చేస్తున్నామని ఆర్‌డీ వివరించారు. ఈ పరిణామం దరఖాస్తుదారుల్లో గందరగోళానికి దారితీసింది.

శతాధిక వృద్ధురాలి మృతి



రాయవరపు ముత్యాలమ్మ(ఫైల్)

దేవరాపలి: మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాయవరపు ముత్యాలమ్మ (103) మంగళవారం మృతి చెందారు. ఈమె భర్త చెల్లయ్య గతంలోనే మరణించారు. ఈమెకు ఒక కుమారుడు ఉన్నారు. చలాకీగా ఉంటూ చనిపోయే ముందు వరకూ తన పనులను తానే చేసుకునేదని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును సైతం వినియోగించుకున్నట్టు చెప్పారు. ముత్యాలమ్మ మృతి పట్ల గ్రామస్తులు సంతాపం తెలిపారు.

ఖాళీ క్యారేజీలతో ఉపాధి వేతనదారుల ఆందోళన



వెంకటరాజుపురంలో ఖాళీ క్యారేజీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు

- పథకం అమలులో మితిమీరిన రాజకీయ జోక్యం
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న

దేవరాపల్లి: ఉపాధి హామీపథకం బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కూలీలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని తిమిరాం, వెంకటరాజుపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం వేతనదారులు ఖాళీ క్యారేజీలతో ఆందోళన చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. వెంకన్న మద్దతు పలికారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు కూలి సొమ్ముతో పాటు ఆశాఖలో ఉద్యోగులకు సైతం జీతాలు చెల్లించక పోవడం దారుణమన్నారు. కూటమి పాలనలో ఉపాధి హామీపథకం అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల శ్రామిక కుటుంబాలకు రూ. 800 కోట్లు మేర బకాయిలు ఉండడంతో పేద ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 15 వేల మంది ఉద్యోగులు, సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేసవిలో వ్యవసాయ పనులు లభించక ఉపాధి హామీ పనులపై ఆధారపడి జీవించే పేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఈ పథకంలో రాజకీయ జోక్యం మితిమీరిపోతోందని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఏక పక్షంగా తొలగించి కూటమి సానుభూతి పరులను నియమిస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో పార్టీల వారీగా పను లకు కేటాయిస్తున్నారని, అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే పనులు కల్పించేలా ఒత్తిళ్లు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితులు మునుపెన్నడూ లేవని, ఉపాధి బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న ఉపాధి పనులు బంద్ చేస్తామని, దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వెంకన్న కోరారు.



రూ.31 కోట్లతో తాగునీటి సమస్యకు పరిష్కారం

- ఉపాధి హామీలో ఇంకుడు గుంతల తవ్వకాలు
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ సుభద్ర వెల్లడి



హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట(విశాఖ): ఉమ్మడి విశాఖజిల్లాలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.31 కోట్లు కేటాయించిందని, ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర మంగళవారం తెలిపారు. జల్ జీవన్ మిషన్ పనులు కూడా ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఆమె వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన పలు స్థాయీ సంఘాల సమావేశాల అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మూడు ఇంకుడు గుంతల తవ్వకానికి అనుమతిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న మురుగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఇంకుడు గుంతలను నిర్మించనున్నట్టు చైర్‌పర్సన్ వెల్లడించారు. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి సుమారు రూ. 74 వేల వరకు ఖర్చు అవుతుందని, ఈ నిధులను పూర్తిగా ఉపాధి హామీ పథకం ద్వారానే వెచ్చిస్తామని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభకు సమర్పించగా, సభ్యులు పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీపై స్పందిస్తూ, ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఒకవేళ ఎవరికైనా పింఛను అందకపోతే వెంటనే ఎంపీడీవోని సంప్రదించాలని చైర్‌పర్సన్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థలం కలిగిన రైతులు తమ భూముల్లో మొక్కలు పెంచడానికి ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకోవచ్చని ఆమె తెలిపారు.

మన్యంలో దోమల బెడద

అరకు జెడ్పీటీసీ శెట్టి రోషిణి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో దోమల బెడద అధికంగా ఉందని, దీని నివారణకు తక్షణమే ఫాగింగ్ చేపట్టాలని కోరారు. దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. 108 అంబులెన్సులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె చెప్పారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, మూడు జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

5 ఏళ్లుగా పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్


నిందితుడు రామరాజుతో ఎస్సై

రోలుగుంట: హత్యాయత్నం కేసులో అయిదేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై రామకృష్ణారావు మంగళవారం తెలిపారు. మండలంలోని బీబీపట్నం గ్రామానికి చెందిన బాకూరి రామరాజుపై హత్యాయత్నం కేసు నమోదు కాగా, అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి వచ్చినట్టు సమాచారం అందుకుని మంగళవారం ఇతన్ని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

అనకాపల్లి టౌన్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై రవికుమార్ మంగళవారం తెలిపారు. ఓ గ్రామానికి చెందిన బాలిక(14)పై తగరంపూడి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడినట్టు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

11 మంది కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు

సాక్షి, విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 11 మంది కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో బ్లాస్ట్‌ఫర్నేస్-1 విభాగంలో సమ్మె ప్రచారం నిర్వహించారు. దీనిపై ఆగ్రహించిన యాజమాన్యం కంపెనీ నిబంధనలకు వ్యతిరేకంగా పనిప్రదేశం వదిలి వెళ్లడాన్ని తప్పు పడుతూ 11 మంది కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మరికొందరికి బుధవారం నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం. కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. యాజమాన్యం వైఖరికి నిరసనగా బుధవారం ఉదయం ఉక్కు అడ్మిన్ భవనం కూడలి వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు కార్మిక నాయకులు ప్రకటించారు.

భళా... ఆమె నృత్య కళ

- ఉద్యోగం చేస్తూనే శిక్షణ
- ఆసక్తి చూపుతున్న బాలబాలికలు
- శాస్త్రీయ నృత్యంలో రాణింపు
- నాట్య గురువు ఉమాదేవి స్ఫూర్తిదాయకం

నర్సీపట్నం: సంస్కృతీ సంప్రదాయాలను బోధిస్తూనే... మనసుకు ఆహ్లాదం పంచుతోంది నృత్యం. ఈ కళావైభవాన్ని భావితరాలకు పంచేందుకు కృషి చేస్తున్నారు నాట్యగురువు ఉమాదేవి. అభినయం, నృత్యంలో ఎవరూ సాటిరారనేలా తన శిష్య బృందంతో నర్తిస్తూ ప్రశంసలందుకుంటున్నారు. శాస్త్రీయ నృత్యంలో చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నారు.

తొలుత నృత్యంపై ఆసక్తి పెంచుకున్నామె, అందులో పట్టుసాధించి శిక్షకురాలిగా మారారు. ప్రభుత్వ సంస్థలో ఔట్ సోర్సింగ్ విభాగంలో ఉద్యోగిగా స్థిరపడినప్పటికీ నృత్యంపై మక్కువతో పది మందిని తీర్చిదిద్దాలనే తపనతో పెదబొడ్డేపల్లిలో శ్రీమృత్యేశ్వర నాట్య అకాడమీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 12 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు తర్ఫీదు ఇస్తున్నారు.


వేసవి శిబిరంలో బాల, బాలికలకు నృత్యంలో శిక్షణ ఇస్తున్న నాట్య గురువు ఉమాదేవి

పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక ప్రదర్శనలు...

శాశ్వత శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందుతున్న బాలికలు, శిక్షకురాలు ఉమాదేవి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. తిరుపతి, అన్నవరం, అప్పనపల్లి పాటు నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ఇస్తూ ప్రశంసలు పొందుతున్నారు. అటు చదువులోనూ ఇటు కళల్లోనూ రాణిస్తూ పలువురి మెప్పు అందుకుంటున్నారు. బాలబాలికల్లో దాగి ఉన్న అంతర్గత ప్రతిభకు పదును పెడుతూ శాస్త్రీయ నృత్యంలో ఎంతో మంది ప్రముఖల మన్ననలు పొందుతున్నారు. సంప్రదాయ నృత్యంతో శ్రీమృతేశ్వర నాట్య అకాడమీ బాలికలు నర్సీపట్నం పేరున నలుదిశలా వ్యాపింపజేస్తున్నారు.


ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇస్తున్న రెగ్యులర్ బాలికలు, నాట్య గురువు ఉమాదేవి

వేసవి విజ్ఞాన శిబిరంలోనూ తర్ఫీదు

మరికొంత మంది బాలబాలికలను శాస్త్రీయ నృత్యంలో తీర్చిదిద్దేందుకు నర్సీపట్నం శారదానగర్‌లో వేసవి నృత్య శిక్షణ శిబిరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ శిబిరంలో ఆంధ్రనాట్యంలోని అన్నమాచార్యులు, త్యాగరాజు కీర్తనలపై శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శాస్త్రీయ నృత్యంపై 35 మంది బాలబాలికలకు నేర్పిస్తున్నారు. అటు చదువులోనూ.. ఇటు సంప్రదాయ నృత్యంపై చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

నృత్యం అంటే మక్కువ...



చిన్నప్పటి నుంచి శాస్త్రీయ నృత్యం అంటే ఇష్టం. గజముఖ నృత్య అకాడమీ ధనం మాస్టారు దగ్గర శాస్త్రీయ నృత్యంలో తర్ఫీదు పొందాను. నేను నేర్చుకున్న కలను పలువురికి అందించాలనే తపనతో సొంతంగా శ్రీమృత్యేశ్వర నృత్య అకాడమీని స్థాపించాను. నా దగ్గర ప్రస్తుతం 47 మంది బాలబాలికలు శిక్షణ పొందుతున్నారు. శిక్షణకే పరిమితం కాకుండా బాలికలతో కలిసి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. ఉద్యోగం ఉన్నప్పటికీ కళ మీద మక్కువతో శిక్షణ ఇస్తున్నాను. తల్లిదండ్రులు పిల్లల అభిరుచికి అనుగుణంగా ప్రోత్సహించాలి.

–ఉమాదేవి, అకాడమీ శిక్షకురాలు, నర్సీపట్నం

నృత్యంలో రాణించడమే లక్ష్యం



శాస్త్రీయ నృత్యమంటే ఇష్టం. చదువుకుంటూనే సమయాన్ని వృథా చేయకుండా అకాడమీకి వచ్చి ఆంధ్ర న్యాటం నేర్చుకుంటున్నాను. శాస్త్రీయ నృత్యాల్లో రాణించాలనేది నా కల.

–లలితా శాన్వీక, పెదబొడ్డేపల్లి

నృత్యం నేర్చుకోవటం అదృష్టం...



అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలకు నృత్యం నేర్చుకోవటం నా అదృష్టం. నృత్యంలో ప్రాథమిక అంశాలు నేర్చుకున్నాను. నృత్యంలో రాణిస్తానన్న నమ్మకం ఉంది. టీచర్ ఉమాదేవి ప్రోత్సహంతో నృత్యంలో రాణిస్తాను.

–యశ్విత, నర్సీపట్నం

పచ్చిరొట్ట సాగుకు అనుకూలం

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున కోత దశలో నువ్వు పైరును వాతావరణ పరిస్థితులు గమనించి కోసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోసిన పంటలు వర్షానికి తడవకుండా రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాగల వర్షాన్ని ఉపయోగించుకుని ఖరీఫ్‌కి ముందు జనుము లేదా జీలుగ లేదా పిల్లిపెసర లేదా పెసర వంటి పచ్చిరొట్ట పైరును వేసుకోవడానికి ఇదే అనువైన సమయమని పేర్కొన్నారు. వర్షాన్ని వినియోగించుకుని చెరకు వేసే రైతులు నేల తయారీ చేసుకోవాలన్నారు. చెరకులో నల్లి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పక్వానికి వచ్చి మామిడి, బొప్పాయి పండ్లను కోసి మార్కెట్‌కు తరలించాలన్నారు. పక్వానికి రాని గెలలు ఉంటే, కింద పడకుండా ఉండడానికి కర్రలతో ఊతమివ్వాలన్నారు. మామిడిలో పండు ఈగ ఆశించే అవకాశం ఉందని, నివారణకు రాలిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలన్నారు. ప్లాస్టిక్ పళ్లెంలో మిథైల్ యూజినాల్ 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి తోటలో వేలగట్టాలని లేదా మార్కెట్‌లో లభ్యమయ్యే పండు ఈగను ఆకర్షించే బుట్టలను ఎకరాకు 5 చొప్పున 5–6 అడుగుల ఎత్తులో కొమ్మలకు కట్టాలని సూచించారు. వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవడానికి ఇది సరైన సమయమన్నారు. లోతు దుక్కులు చేయడం వల్ల కలుపు సమస్యను అధిగమించవచ్చని, పంటను నష్టపరిచే కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి.భవాని, పి.వి.పద్మావతి. ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

మామిడి పండ్ల దుకాణాల్లో తనిఖీలు

యలమంచిలి రూరల్: నిషేధిత రసాయనాలతో మగ్గబెడుతున్న మామిడి పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడానికి ఆహార నియంత్రణ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లా ఆహార భద్రతా కమిటీ నిర్ణయం మేరకు జిల్లా వ్యాప్తంగా మామిడి పండ్ల అమ్మకాలపై ఆహార నియంత్రణ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. యలమంచిలి పట్టణంలో ప్రధాన రహదారికి అనుకుని ఏర్పాటు చేసిన మామిడి పండ్ల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు జరిపారు. జిల్లా ఆహార నియంత్రణ అధికారి ఎస్.శ్రీజ, స్థానిక మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లను నిశితంగా పరిశీలించారు.రెండు దుకాణాల్లో మామిడి పండ్ల శాంపిళ్లను సేకరించారు. ఇక్కడ విక్రయిస్తున్న మామిడి పండ్లు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారో చెప్పాలని వ్యాపారులను అడిగినప్పటికీ వ్యాపారులెవరూ వారికి పండ్లు సరఫరా చేస్తున్న పెద్ద వ్యాపారి పేరు చెప్పలేదు.అయితే పట్టణంలోని మామిడి పండ్లు అమ్ముతున్న వ్యాపారులందరికీ ఒకే వ్యాపారి వ్యాన్లతో సరఫరా చేస్తున్నట్టు అధికారులు తెలుసుకున్నారు.నిషేధిత కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో మామిడి కాయలను పక్వానికి రాకుండానే మగ్గబెట్టి ప్రజలకు విక్రయించే వ్యాపారులపై నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని శ్రీజ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 21 మామిడి పండ్ల శాంపిళ్లను సేకరించినట్టు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ రవికుమార్ 'సాక్షి'కి తెలిపారు.సేకరించిన మామిడి పండ్ల శాంపిళ్లను ప్రయోగశాలకు పంపిస్తామని,నివేదిక వచ్చిన తర్వాత నిషేధిత రసాయనాలతో మగ్గబెట్టినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార నియంత్రణ అధికారుల తనిఖీలతో మామిడి పండ్ల వ్యాపారులు భయాందోళనకు గురయ్యారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

నర్సీపట్నం: గంజాయి తరలిస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ పి.శ్రీనివాస రావు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ జి.గోవిందరావు, ఎస్సై ఉమామహేశ్వరరావు, సిబ్బంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. చింతపల్లి వైపు నుంచి వస్తూ పోలీసులను గమనించిన స్మగ్లర్లు కారును కొంత దూరంలో ఆపి పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కారు వెనక సీటుకు ప్రత్యేకంగా అర తయారు చేయించి 2 కిలోల చొప్పున ఐదు ప్యాకెట్లలో పది కిలోల గంజాయిని అమర్చారు. తమ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించడంతో గంజాయి బయటపడింది. తమిళనాడు, తిరుపూర్ భారతి నగర్ స్కూల్ వీధికి చెందిన కార్తీక్ అండవర్(34), అదే రాష్ట్రం విజయపురి రోడ్ మేలాతేరు, కోవిలపట్టికి చెందిన కారు డ్రైవర్ దీపన్(34)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కారుతో పాటు వీరి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.8 వేలు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. గంజాయిని కేసును ఛేదించిన సిబ్బందికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సై రమేష్ పాల్గొన్నారు.


గంజాయి, ఇద్దరు నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గోవిందరావు, సిబ్బంది

చందనం విక్రయాలు ప్రారంభం


చందనం ప్యాకెట్లు అందిస్తున్న ఏఈవో

సింహాచలం: చందనోత్సవం నాడు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిపై నుంచి ఒలిచిన నిర్మాల్య చందనాన్ని మంగళవారం నుంచి విక్రయాలు ప్రారంభించారు. ఉచిత దర్శనం క్యూలో 400 మందికి, రూ.100 క్యూలో 300 మందికి, రూ. 300 క్యూలో 300 మందికి ఒక్కో ప్యాకెట్ రూ.10 చొప్పున విక్రయించారు. దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత


ఇంటర్ విద్యార్థులు


ఇంటర్ విద్యార్థులు

పాయకరావుపేట: సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ మంగళవారం తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఎస్.సత్యసాయి 483/500, ఎమ్.యశ్వసి 482/500, పి.తరుణ్ 481/500, ఎస్.రఘునందన్ 478/500 మార్కులతో సత్తా చాటారని, ప్లస్ –2 ఫలితాల్లో జి.సాయి అనీష్ 469/500, ధాత్రి నిహారిక 466/500 మార్కులు సాధించారన్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. మాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో తమ విద్యార్థులు 100/100 మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

భోగాపురం-రాంబిల్లి మధ్య సెమీ రింగ్ రోడ్

- 85 కిలోమీటర్ల మేర 4/6/8 వరుసల రహదారికి ప్రణాళికలు
- డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్ నియామకానికి వీఎంఆర్‌డీఏ చర్యలు
- ఆసక్తి వ్యక్తీకరణకు కన్సల్టెంట్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ సిటీ: భోగాపురం విమానాశ్రయానికి అనుసంధాన రహదారుల నిర్మాణాలపై వీఎంఆర్‌డీఏ దృష్టి పెట్టింది. నగరం నుంచే కాకుండా అనకాపల్లి నుంచి కూడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి చర్యలు చేపడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఏడు రహదారుల నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. తాజాగా భోగాపురం–రాంబిల్లి మధ్య ప్రతిపాదిత సెమీ రింగ్ రోడ్డు(ఎస్ఆర్ఆర్) అభివృద్ధికి అడుగులు వేగంగా వేస్తోంది. సుమారు 85 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఇందుకోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ నియామకానికి ఆసక్తి వ్యక్తీకరణ(ఆర్ఎఫ్‌పీ) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.


4 నుంచి 8 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారులు

అనకాపల్లి, పెందుర్తి, ఆనందపురంలను అనుసంధానిస్తూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 4/6/8 వరుసల గ్రీన్ ఫీల్డ్ యాక్సెస్ సెమీ రింగ్ రోడ్‌ను వాల్యూ క్యాప్చర్ ఫైనాన్స్ ఆధారంగా నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సర్వేతో పాటు అనువైన ప్రాంతాలను కలుపుతూ రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమయ్యే భూ సేకరణ, సర్వే, సాంకేతిక, ఆర్థిక, ఇతర అన్ని అంశాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియను చేపట్టేందుకు కన్సల్టెంట్ నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించింది.

విమానాశ్రయం కనెక్టివిటీకి..

విశాఖ చుట్టు పక్క ప్రాంతాల పట్టణీకరణతో పాటు అచ్యుతాపురం నుంచి భోగాపురం బీచ్‌కు, రాంబిల్లి, సమీప ప్రాంతాల మధ్య రద్దీ నియంత్రణకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన ఆరు వరుసల జాతీయ రహదారికి ఈ కొత్త రహదారులు అనుసంధానించడం ద్వారా అక్కడి నుంచి తీర ప్రాంతాల మధ్య వేగవంతమైన ప్రయాణానికి మార్గం సుగమమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇది పర్యాటకాభివృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు ఆర్థికాభివృద్ధి అవకాశం కలుగుతుందని విశ్వాసంతో ఉన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు.

ప్లానింగ్ కమిషన్ సమావేశానికి అనకాపల్లి ఎంపీపీ


ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి: తిరుపతిలో ఈ నెల 15న జరగనున్న 16వ ప్లానింగ్ కమిషన్ సమావేశానికి అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబుకు ఆహ్వానం అందింది. గత నెల 17న తిరుపతిలో జరిగిన ఇదే సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 18 మందిని ఆహ్వానించగా, అప్పుడు సూరిబాబు హాజరయ్యారు. మళ్లీ రెండో సారి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తనకు మాత్రమే ఆహ్వానం అందడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిధుల అవసరాలపై చర్చించనున్నట్లు మంగళవారం ఆయన సాక్షికి తెలిపారు.

ఎన్‌డీపీఎస్ కేసులో నిందితుడి అరెస్టు

దాబాగార్డెన్స్: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, జోన్–1 డీసీపీ అజిత వేజెండ్ల సూచనలతో లాంగ్ పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూ అరెస్టు వారెంటు ఉన్న వ్యక్తి పరారీలో ఉండగా .. నిందితుడు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం 2018 నాటి ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్) కేసులో నిందితుడైన బండారి అజయ్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని మంగళవారం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఎన్‌బీడబ్ల్యూ ప్రత్యేక బృందాన్ని నగర పోలీస్ కమిషనర్, డీసీపీ–1, ఈస్ట్ ఏసీపీ అభినందించారు.

నునపర్తిలో అక్రమ గ్రావెల్ దందా

రాత్రిళ్లు భారీగా లారీల్లో తరలింపు


రాత్రిళ్లు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనం


నడింపల్లిలో గ్రావెల్ తవ్విన ప్రదేశం

అచ్యుతాపురం రూరల్: మండలంలోని నునపర్తి శివారు నడింపల్లి కొండల్ని రాత్రికి రాత్రి గ్రావెల్ దొంగలు దోచేస్తున్నారు. రెండు జేసీబీలతో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి సుమారు 20కుపైగా లారీలతో తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికంగా కొందరు యువకులు తెలిపారు. అక్రమ కేసుల్లో ఇరికిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వాపోతున్నారు. రేయింబవళ్లు అని తేడా లేకుండా ఇష్టారాజ్యంగా చెట్లను నరికేయడం, కొండలను పిండి చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ ధనార్జన చేస్తున్నారు. ఎవరైనా అధికారులు తూతూమంత్రంగా ఆపినా ఒకట్రెండు రోజులు తర్వాత షరామామూలే అన్నట్టుగా గ్రావెల్ దందా చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని పర్యావరణాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్ల డ్యూటీ నుంచి మినహాయించాలి

అనకాపల్లి: గ్రామాల్లో సామాజిక పింఛన్లు పంపిణీలో సచివాలయ ఉద్యోగులకు రెండు, మూడు నెలలు పాటు సహకరించాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నాగశేషు తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం ఆమె మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి పిల్లల బరువు తీయడం, టీహెచ్ఆర్(టేక్ హోమ్ రేషన్) పంపిణీ చేయడం, పిల్లలకు వండి పెట్టడం, ప్రీ స్కూల్ నిర్వహించటం , యాప్‌లో అప్‌లోడ్ చేయడం ఇలా అనేక పనులతో సతమతమవుతున్న నేపథ్యంలో పెన్షన్ పంపిణీ భారం మోపాద్దన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నట్లు వాపోయారు. గుంటూరులో రాజకీయ జోక్యం వల్ల ఒక కార్యకర్తను సస్పెండ్ చేశారన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం. దుర్గరాణి, సభ్యురాలు సిహెచ్ రామలక్ష్మి, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగశేషు

గురువుల్లో గుబులు

కూటమి ప్రభుత్వం విద్యారంగంపై చేస్తున్న ప్రయోగాలు గురువుల్లో గుబులు రేపుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా జీవో నెం.117 పేరిట పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ జీవోను రద్దు చేస్తూ పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడు రకాల స్కూళ్లను ఏర్పాటు చేయనుంది. దీంతో ప్రాథమిక విద్యకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పాఠశాలల పునర్నిర్మాణంతో పోస్టులు కుదింపు
- ఉమ్మడి జిల్లాలో 538 పోస్టుల సర్దుబాటు
- 277 ఎస్ఏ పోస్టులు మోడల్ స్కూల్ హెచ్ఎంలుగా మార్పు
- ఆ మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు మంగళం
- కూటమి ప్రభుత్వ చర్యలతో ప్రాథమిక విద్యకు విఘాతం

విశాఖ విద్య: కూటమి ప్రభుత్వం పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. దీనిలో భాగంగా తొమ్మిది రకాల బడుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఏడు రకాల బడులను అమల్లోకి తీసుకొచ్చారు. పంచాయతీకి ఒకటి చొప్పున విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని ఉమ్మడి జిల్లాలో 565 మోడల్ స్కూళ్లను ప్రతిపాదించారు. గత కొన్ని రోజులుగా చేసిన కసరత్తు మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కూటమి ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యలతో మిగులు పోస్టులు పెరిగి, ప్రాథమిక విద్యకు నష్టం తప్పదని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

89 యూపీ స్కూళ్ల కొనసాగింపు

కూటమి ప్రభుత్వం ప్రాథమికోన్నత(యూపీ) పాఠశాలను పూర్తిగా రద్దు చేయాలని భావించింది. కానీ, ఆయా ప్రాంతాల ప్రజానీకం, తల్లిదండ్రుల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో అధికారులు వెనక్కి తగ్గారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో దూరాభారాన్ని దృష్టిలో పెట్టుకుని 89 యూపీ స్కూళ్లను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యార్థులు ఎక్కువగా ఉన్న 33 యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా మార్పు చేశారు. విశాఖ జిల్లాలో 5, అనకాపల్లి జిల్లాలో–19, అల్లూరి జిల్లాలో–9 హైస్కూళ్లుగా మారాయి.

538 పోస్టులు సర్దు'పోటు'

స్కూళ్ల పునర్నిర్మాణంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 538 ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేశారు. ఆయా మేనేజ్‌మెంట్ల పరిధిలోని పాఠశాలల్లో మిగులు కేటగిరీలో ఉన్న 230 మందిని అవసరమైన చోట సర్దుబాటు చేశారు. మరో 31 పోస్టులను ఇతర కేటగిరీల్లోకి మార్చారు. హైస్కూళ్లలో పనిచేస్తున్న 277 మంది స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులుగా సర్దుబాటు చేశారు. దీంతో భవిష్యత్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల భర్తీ తగ్గిపోనుందని ఉపాధ్యాయ వర్గాలు చెప్తున్నాయి.

ఏడు రకాల బడులు ఇలా..

స్కూల్ కేటగిరీ	విశాఖ	అనకాపల్లి	అల్లూరి	మొత్తం
ఫౌండేషన్	41	151	36	228
బేసిక్ ప్రైమరీ(బీపీఎస్)	231	763	925	1,919
మోడల్ ప్రైమరీ(ఎంపీఎస్)	178	188	199	565
అప్‌గ్రేడ్ హైస్కూళ్లు	5	19	9	33
హైస్కూళ్లు	76	145	16	237
హైస్కూల్ ప్లస్ బీపీఎస్	10	75	2	87
యూపీ స్కూళ్లు	21	55	13	89

క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



పోటీల్లో విద్యార్థులు

కశింకోట: తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల 13వ రోజు 'గ్రంథాలయాల ప్రయోజనాలు' అంశంపై ఈ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

10 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. గవరపాలెం సతకంపట్టు వీధికి చెందిన పాన్‌షాపు నిర్వాహకుడు ఆళ్ల వెంకటరమణ(64) నుంచి వీటిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును మంగళవారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ లబ్ధిదారు కుటుంబానికి అందజేశారు. ప్రైవేటుగా వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలను ఆదుకోవడంలో భాగంగా అక్కెరపు వెంకటరమణ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి ఇచ్చిన సహాయాన్ని అందజేసినట్లు పీలా తెలిపారు. కార్యక్రమంలో కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కపోతకు విలవిల



బోసిపోయిన పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజలు గుబురు ఎండతో మంగళవారం సతమతమయ్యారు. ఎండ కాంతి తీవ్రత కనిపించనప్పటికి గుబురు ఎండతో ఉక్కపోతకు గురయ్యారు. ఎక్కువ మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత కాస్త తగ్గి చల్లబడటంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అయితే రాత్రి వరకు ఉక్కపోత కొనసాగడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 262 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,350	4,900
రెండో రకం	3,960	4,210
మూడో రకం	3,510	3,700

అనకాపల్లి సినిమాలు

రాజా	: రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1	:శుభం
సత్యనారాయణ స్క్రీన్-2	: జగదీక వీరుడు అతిలోక సుందరి
పర్తిసాయి	:హిట్-3
షిర్డీసాయి	సింగల్
వెంకటేశ్వర	:సీఎం పెళ్లాం
శ్రీ సత్య	: సారంగపాణి జాతకం
రామచంద్ర	:తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 16 యూనిట్లు, బీ పాజిటివ్ -11, ఓ పాజిటివ్ -17, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్ 9703619706ను సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కొనే ముందు జాగ్రత్త





మార్కెట్‌లో విక్రయిస్తున్న రంగురంగుల మామిడిపండ్లు

తుమ్మపాల: మామిడిని పండ్ల జాతికే రారాజుగా పిలుస్తారు. అలాంటి మామిడి పండు అంటే ఇష్టపడని వారెవరూ ఉండరు. మే, జూన్ నెలల్లో సహజసిద్ధంగా మగ్గె మామిడిని ముందుగా మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో కొందరు వ్యాపారులు సహజ పద్ధతుల్లో మగ్గించకుండా కృత్రిమంగా మగ్గించడం వల్ల ఎన్నో అనర్థాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడాది మామిడిలో ఆశించిన దిగుబడి రాలేదు. దీన్ని వ్యాపారులు ఆసరాగా చేసుకుని వినియోగదారుల జేబుకు చిల్లులు పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే మామిడి దిగుబడి తగ్గడంతో ధర పెరిగింది. నాణ్యతతో కూడిన ఫలాలు ఆశించిన మేర బహిరంగ మార్కెట్లో లేవు. ఉన్న దిగుబడిని పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతోంది. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అకాల వర్షాలు, గాలులకు నేలరాలిన మామిడి పండ్లను సేకరించి వాటిపై ప్రమాదకర కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి కాయలను త్వరితగతిన పక్వానికి తీసుకొస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ తరహా కెమికల్స్ (రసాయనాల)ను వినియోగించకూడదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఆరోగ్యకర పద్ధతిలో సహజత్వానికి దగ్గరగా మామిడి కాయలను పండించాల్సి ఉన్నప్పటికీ.. వ్యాపారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మామిడి ఫలాలకు మంచి డిమాండ్ ఉండడంతో లాభాపేక్షతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పండించి అమ్మకాలు చేపడుతుండంతో అవి అనారోగ్య కారకాలుగా మారుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఉద్యానవన అధికారులు రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

పక్వానికి వచ్చినప్పుడు...

మామిడి కాయలు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తయ్యే ఇథిలియన్ కారణంగా కాయలు పండి మంచి రంగును స్వయంగా చేకూర్చుకుంటాయి. తద్వారా వచ్చిన రుచి, పోషకాలు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. అయితే కొంతమంది ఈ తరహా పద్ధతులకు స్వస్తి చెప్పి రసాయనాలతో మగ్గించి, ప్రజల ఆరోగ్యంతో ఆటలాడతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇథిలియన్ వాయువు 100 పీపీఎంలు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఈ వాయువును 24 గంటలు తగిలేటట్టుగా ఐదు రోజులు కాయలను ఉంచితే సహజత్వానికి దగ్గరగా ఎటువంటి హాని లేకుండా పక్వానికి వస్తాయి. మామిడి కాయల కోత అనంతరం వంద లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిల్ కలిపి అందులో ముంచి ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా పండుతాయి. మరింత సురక్షితంగా, సంప్రదాయబద్ధంగా పండించాలంటే ఇళ్లలో వరిగడ్డి వేసి కాయలను నిల్వ ఉంచడం ద్వారా పండించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రంగు చూసి మోసపోవడం, సీజన్‌కు ముందు వచ్చే పండ్లను ఆరగించడం ఆరోగ్యకరం కాదని గుర్తించాల్సి ఉంది. బహిరంగ మార్కెట్లో పండ్లను కొని తినే ముందు ఉప్పు నీటిలో 20 నిమిషాలు ఉంచి తిరిగి మంచి నీటితో శుభ్రంగా కడిగి అనంతరం తొక్కను తీసి తినడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.

భారీగా తగ్గిపోయిన దిగుబడి

మండలంలో దాదాపు ప్రతి గ్రామంలోను మామిడి తోటలు ఉన్నప్పటికి తక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది ఈదురు గాలులకు కాయ దశలోనే చాలా వరకు కిందపడి దిగుబడి భారీగా తగ్గిపోయింది. అక్కడక్కడ కొంత మేర పండినా మామిడి ఆయా గ్రామాల పరిధిలోనే విక్రయాలు జరిగిపోతున్నాయి. పట్టణంలో మార్కెట్‌కు ఇతర ప్రాంతాల నుంచి మామిడి దిగుమతి చేసుకుని వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో డజన్ పండ్లు ప్రస్తుతం రూ.300 వరకు మార్కెట్ ధర ఉంది. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ వాణిజ్య కేంద్రంగా ఉన్న అనకాపల్లిలో నిత్యం వేల సంఖ్యలో మామిడి దిగుమతి జరుగుతుంది. ఇక్కడ నుంచి జిల్లా వ్యాప్తంగా సరఫరా అవుతుంది. ఈ ఏడాది ముందుగానే మామిడి పండ్లు మార్కెట్‌లోకి రావడంతో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. రంగు చూసి కాకుండా ప్రజలు పూర్తి అవగాహన కలిగి పండ్లను కొనుగోలు చేయాలని, కృత్రిమ పండ్లను గుర్తించే చిట్కాలు తెలుసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

తేడాలను గుర్తించండిలా...

సహజంగా పండే మామిడి కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి లోపలి భాగం పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా పండే పండ్లు మొత్తం ఒకే విధమైన రంగును కలిగి ఉంటాయి. పైకి పండినట్టు కనిపించినా లోపల ఫలం రుచిలో తేడా ఉండి పుల్లదనం ఉంటుంది. సహజంగా పండే పండ్ల నుంచి వచ్చే వాసన ఇట్టే గుర్తించవచ్చు. కృత్రిమంగా పండించిన పండ్ల నుంచి వాసన ఏమాత్రం రాదు. సంప్రదాయ బద్ధంగా పండించే పండ్లలో తగినంత చక్కెర శాతం ఏర్పడి తియ్యగా ఉంటాయి.

ఆరోగ్యానికి హాని...



కృత్రిమంగా కార్బైడ్ ఉపయోగించి పండించిన పండ్లు ఆరగించడం వల్ల ఆరోగ్యానికి హాని. దీని వల్ల కడుపులో అల్సర్, క్యాన్సర్‌తో పాటు కాలేయం, మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వినియోగదారులు శ్రేష్టమైన, సహజసిద్ధంగా పండే మామిడి పండ్లను ఆరగించాలి. నిషేధిత పదార్థాలను వాడి మామిడిని పండించి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

– డి.డి. నాయుడు, వైద్యుడు, అనకాపల్లి

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



విజేతలతో కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక శ్రీరామదేవ వ్యాయామ సంఘం సభ్యులు విజయం సాధించారు. వీరిని మంగళవారం జిమ్ నిర్వాహకులు అభినందించారు. 53 కేజీల విభాగంలో గుమ్మాల భానుప్రసాద్, 61 కేజీల విభాగంలో కోడూరు జగన్నాథం, 93 కేజీల విభాగంలో ఇల్లపు గణేష్, 71 కేజీల విభాగంలో టెక్కలి శ్రీనివాస్, 110 కేజీల విభాగంలో శ్రీకాకుళపు స్వరూప్ గోల్డ్ మెడల్స్ సాధించారు. 83 కేజీల విభాగంలో చిత జయంత్, జాజుల రామలక్ష్మి, 72 కేజీల విభాగంలో సబ్బవరపు శ్రావణకుమార్ సిల్వర్ మెడల్స్ సాధించారు. కార్యక్రమంలో జిమ్ కమిటీ అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, ఉపాధ్యక్షుడు పెదిరెడ్ల రమేష్, జాయింట్ సెక్రటరీ ఉగ్గిన శివ, కోశాధికారి వెదుళ్ల సూకేష్, గొర్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. జార్జి క్లబ్ జిమ్ సభ్యుడు ఆళ్ల నవీన్ 66 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. అతడిని క్లబ్ అధ్యక్షుడు బి.ఎం.ఎస్.కె. జోగినాయుడు, కార్యదర్శి కాశీమాస్టార్, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి అనకాపల్లి విద్యార్థులు



ఎన్‌సీసీ విద్యార్థుల క్యాంపు

అనకాపల్లి: విశాఖ ఏవీఎన్ కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్ నుంచి 50 మంది ఎన్‌సీసీ విద్యార్థులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి ఎ.సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 23వ తేదీ వరకు అక్కడ తర్ఫీదు పొందుతారన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు వి.నారాయణరావు, పి.కృష్ణకిశోర్, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

సివిల్ సప్లయి కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20 దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. శంకరం పంచాయతీలో సివిల్ సప్లయి యూనియన్ ఆధ్వర్యంలో సివిల్ సప్లయి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మిక వర్గం బుద్ధి చెప్పడానికి సమ్మె తలపెట్టినట్టు పేర్కొన్నారు. సివిల్ సప్లయి గొడౌన్‌లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.త్రినాథ్, కార్మికులు పాల్గొన్నారు.

డీపీటీవో కార్యాలయం ముట్టడి



మాట్లాడుతున్న ఎస్‌ఎంయూఏ నాయకులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర స్థాయిలోని సమస్యలు పరిష్కరించాలని, అక్రమంగా బదిలీ చేసిన ఉద్యోగులకు కండక్టర్ ఎస్ఎస్ నారాయణకు అనకాపల్లి డిపోలోనే పోస్టింగ్ ఇవ్వాలని ఎస్ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణలో డీపీటీవో కార్యాలయ ముట్టడి కార్యక్రమం మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్మికులు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు వి. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 0–19 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్, జోనల్ చైర్మన్ ఎం. సూర్యం, ఉపాధ్యక్షుడు బి.ఎస్. రంగా, ఎస్. రాజు, జి. శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఉత్కంఠగా మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ బృందం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో రాష్ట్ర పోలీస్ కమాండో విభాగం ఆక్టోపస్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ థండర్'మాక్ డ్రిల్‌ను మంగళవారం ఉత్కంఠగా నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో పోలీస్ యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై ఈ మాక్‌డ్రిల్ కొనసాగింది. మాక్ డ్రిల్‌లో భాగంగా ఆరుగురు ఉగ్రవాదులు ఆయుధాలతో ఎన్టీపీసీలో చొరబడి, బహిరంగ కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న ఆక్టోపస్ బృందం వెంటనే స్పందించి వ్యూహాత్మక ఆపరేషన్ ప్రారంభించింది. ఉగ్రవాదులను న్యూట్రలైజ్ చేసి వారి చేతిలో బందీలుగా ఉన్న వారిని రక్షించింది. మాక్ డ్రిల్ నిర్వహణ కోసం ముందుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్‌కుమార్, ఆక్టోపస్ అదనపు పోలీస్ అధికారి రాజారెడ్డి, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, వైద్య సిబ్బంది, రెవెన్యూ, సేఫ్టీ అధికారులు, అనకాపల్లి ఏఆర్ విభాగానికి చెందిన బీడీ టీం, డాగ్ స్క్వాడ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం విజయనగరానికి చెందిన డాక్టర్ వెంకటేశ్వరరావు దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు బాండ్ అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. పీఆర్వో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహం పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో రైతుకు, నేలకు మేలు



రైతులకు పప్పు జాతి విత్తనాలు అందిస్తున్న దృశ్యం

చీడికాడ : ప్రకృతి సాగుతో అటు రైతుకు ఇటు నేలకు ఆరోగ్యమని ఏట కృష్ణవేణి అన్నారు. మంగళవారం మంచాలలో రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ, వెలుగు డిపార్టుమెంట్లు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మంచాల గ్రామాన్ని శత శాతం మోడల్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. ఈ మేరకు ఖరీఫ్ సాగుకు ముందు 30 రకాల పప్పు జాతి విత్తనాలను రైతులకు అందించారు. ప్రతి రైతు తమకు గల పొలంలో కొంత మేర ప్రకృతి సాగుకు వినియోగించాలన్నారు. వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అనకాపల్లి టౌన్: మండలంలోని వల్లూరు గ్రామంలో యువతి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ జె. నాగేశ్వరరావు వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ఆమె తన ఇంట్లో భోజనం చేసి పడుకుందని, తెల్లవారి చూస్తే కనిపించలేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంగళవారం తెలిపారు.

15న కూకట్‌పల్లిలో నూకాంబిక జాతర



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లి: మన రాష్ట్రంలో నూకాంబిక కొత్త అమావాస్య జాతర నిర్వహించినట్లు మాదిరిగానే ఈనెల 15న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించనున్నట్లు నాగార్జున ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు మళ్ల సురేంద్ర తెలిపారు. స్థానిక గవరపాలెం సెంటర్ పార్కులో జాతర పోస్టర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అనకాపల్లి నూకాంబిక ఉత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండగగా నిర్వహించిందన్నారు. తెలంగాణలోను అమ్మవారి ఉత్సవాన్ని రాష్ట్ర పండగగా గుర్తించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నూకాంబిక ఉత్సవ కమిటీ ప్రతినిధి కర్రి కిశోర్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను వేంజేపచేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోప వీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఆలయ భూముల శిస్తులకు వేలం వాయిదా

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ భూములు శిస్తులకు వేలం వాయిదా పడింది. ఇప్పటికే రెండుసార్లు వేలం నిర్వహించగా రైతులు ముందుకు రాలేదు. ఈవో దివ్యతేజ ఈ నెల 24న మళ్లీ వేలం నిర్వహణకు నిర్ణయించారు.

రహదారి పనుల్లో నాణ్యత పరిశీలన



వడ్డాది నుంచి తాటిపర్తి రోడ్డు పనులు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు

మాడుగుల రూరల్: మండలంలో వడ్డాది నుంచి తాటిపర్తి వరకు జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆర్ అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అధికారి జి. వెంకటేశ్వర్లు, క్యూసి సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ అధికారి జి.వి.భాస్కర్ తదితరులు మంగళవారం పరిశీలించారు. రహదారి నాణ్యతను పరిశీలించారు. రహదారి కిరువైపులా, అలాగే కె.జె.పురం , ఎం.కోటపాడు గ్రామాల వద్ద నిర్మించిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ ఏడాది జూన్ చివరినాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేముడునాయుడు పాల్గొన్నారు.

ట్విట్టరు క్యాంపెయిన్‌తో సీహెచ్‌వోల నిరసన



ట్విట్టర్ క్యాంపెయిన్‌తో కమ్యూనిటీ హెల్త్ అధికారులు నిరసన

అనకాపల్లి: జిల్లాలో పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ ఈ కార్నర్ వద్ద సీహెచ్‌వోల సమ్మె మంగళవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు తమ సమస్యలపై ట్విట్టర్‌లో ప్రభుత్వానికి పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు నేటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. వెంటనే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సీహెచ్‌వోలను ఆరేళ్లకే పర్మినెంట్ చేస్తామని, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం, జాబ్ చార్ట్ తదితర డిమాండ్లు నెరవేర్చే దిశగా ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు భవాని, యమున, రేవతి, నూకాలమ్మ, లక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

17న సివిల్స్, గ్రూప్-1పై అవగాహన సదస్సు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17న సాయంత్రం 4 గంటలకు విశాఖ ఐఏఎస్ అకాడమీ సహకారంతో యూపీఎస్సీ(సివిల్స్), ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోటీ పరీక్షలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీ డైరెక్టర్ పోతల గౌతమ్ బోధకులుగా యూపీఎస్సీ(సివిల్స్), 2025 విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానస, మరి కొంతమంది నిష్ణాతులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సివిల్, గ్రూప్-1 పరీక్షల ప్రాధాన్యత, అర్హత, పరీక్ష సిలబస్, దేశపాలనలో సమర్థత, ప్రజా సేవ, పాలసీల అమలు, దేశాభివృద్ధి, న్యాయం, సమర్థవంతమైన పరిపాలన అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9247166511 సంప్రదించాలన్నారు.

గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టాలి

అనకాపల్లి టౌన్: నియోజకవర్గ రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు తెలిపారు. వేసవిలో చేయవలసిన గ్రోయిన్ల పనులు ఇరిగేషన్ అధికారులు మొదలు పెట్టలేదని వాపోయారు. దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నియోజకవర్గంలో ఆరు వేల ఎకరాల్లో రైతులు గ్రోయిన్లపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేయించి ఎల్లయ్య, చౌర్లోపల్లి, నాగులాపల్లి గ్రోయిన్లు మరమ్మతులు చేపట్టాలన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రావికమతం : కొత్తకోట శాఖ గ్రంథాలయానికి కొత్తకోట ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు తాళ్లపురెడ్డి శేషు ఆర్థిక సహాయంతో పుస్తకాలను మంగళవారం వితరణగా అందజేశారు. ఇక్కడ గ్రంథాలయానికి చుట్టుపక్కల గ్రామాలైన దొండపూడి, చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, వమ్మవరం, కన్నంపేట, తదితర గ్రామాల నుంచి నిరుద్యోగులు, డీఎస్సీ (టీచర్),వివిధ పోటీ పరీక్షలకు వెళ్లే వారు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యువకులు వస్తూ ఉంటారు. అందరికీ ఉపయోగపడే సుమారు రూ.7వేలు విలువ గల పుస్తకాలను అసోసియేషన్ సభ్యులు శేషు, గర్రెడ్డి రాంబాబు, కలం నర్సింగ్, అంగజాల వీర ప్రకాష్, తరిపే ఈశ్వరరావు, గుమ్ముడు వాసు, శాఖ గ్రంథాలయాధికారి వరహామణికి మంగళవారం అందజేశారు